

# ఈస్తటిక్ స్పేస్

దగ్గుమాటి పద్మాకర్

నలభై ఏళ్ల లలిత కళ్లు తెరుచుకునే ఉంది. కానీ ఆమెకు కళ్ల ముందున్నవేవీ కనిపించడం లేదు. కుర్చీలో కూర్చొని శిలాప్రతిమలా ఉందామె రెండు నిమిషాల నుంచి.

ఎదురుగా సోఫాలో కూర్చుని ఉన్న రవిబాబు ఆమెనే చూస్తూ ఉండిపోయాడు. తాను అన్న మాట- కాదు, వెలిబుచ్చిన కోరిక ఆమెను స్థాణువయ్యేలా చేసిందని అతనికి తెలుసు.

రవిబాబుకు ఇంత చనువు తాను కల్పించిందా లేక తనే చొరవ చూపించాడా లేక అతనికిది క్షణికంగా పుట్టిన బుద్ధా అని ఆలోచిస్తూ ఉండిపోయింది.

ఆమె ఆలోచనల్లో ముందుగా అమాయకమైన బాల్యం తొంగి చూసింది.

తను చదువుకునేప్పటి కాలేజీ జీవితం, స్వచ్ఛమయిన కలలు, ప్రేమ అన్నీ కళ్ల ముందు కదలాడాయి. యవ్వనంలోని కలలు, భయాలతో పాటు భర్తతో పెళ్లయినప్పటి నుండి గడిపిన సంసార జీవితమంతా గుర్తొచ్చింది. ఇంకా భర్తతో గడిచిన తొలిరాత్రి, భర్త మరణం, ఆ తర్వాత కాలేజీ ఆవరణలో తురాయి చెట్టు కింద రవిబాబుతో తొలి పరిచయం కూడా గుర్తుకొచ్చాయి.

*

రవిబాబు, లలిత ఒకే కాలేజీలో గత నాలుగు సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. లలిత జాయినవడానికి రెండేళ్ల ముందు నుంచీ అదే కాలేజీలో ఉన్నాడు రవిబాబు. లలిత కంటే నాలుగైదేళ్లు పెద్దవాడు అతను.

వాళ్లిద్దరికీ విద్యార్థిదశలో లెఫ్ట్ ఉద్యమాలతో ఎంతోకొంత పనిచేసిన అనుభవాలున్నాయి. అనేక మంది వ్యక్తులతో పరిచయాలున్నాయి. ఇద్దరికీ సాహిత్యం పట్ల ఆసక్తి ఉంది. సమాజం పోకడల పట్ల కొన్ని భేదాభిప్రాయాలు ఉన్నా స్పష్టత ఉంది. ఆమె కవిత్వం రాస్తుంటుంది. అతడు సాహిత్యాంశాలను, సామాజికాంశాలను విశ్లేషిస్తుంటాడు. వారిద్దరికీ వాళ్ల కాలేజీలో సాహిత్యజీవులనే పేరుంది. వాళ్లిద్దరి పరిచయం పట్ల కూడా కాలేజీ స్టాఫ్‌లో సదభిప్రాయమే ఉంది. అందుకు కారణం, కొంత వారు తమ అభిప్రాయాల పట్ల ఖచ్చితంగా ఉండటం, కొంత మేధావి వర్గంతో పరిచయం కలిగి ఉండటం, చేతనైనంతగా ఇతరులను ఆదుకోవడం... వంటివి కావచ్చు.

*

లలిత ఆ కాలేజీలో జాయినవడానికి మూడు నెలల ముందు అంటే సుమారు అయిదేళ్ల క్రితం ఆమె భర్త పోయాడు. ఆ షాక్ నుంచి తేరుకోవడానికి ఆమెకు చాలారోజులు పట్టింది కూడాను. ఆమె మానసికంగా కోలుకోవడానికి కూతురు, అల్లుడు సహకారం చాలా ఉంది. వాళ్లు తమ తమ ఉద్యోగాలకు సెలవు పెట్టి వచ్చి ఆమెను ఓదార్చి మళ్లీ మామూలు మనిషిని చేశారని చెప్పాలి. చివరికి వెళుతూ వెళుతూ వాళ్లిచ్చిన సలహా- వేరే ఊర్లో, వేరే కాలేజీలో జాయిన్ అయితే భర్త జ్ఞాపకాలు కొంత తగ్గుతాయని. అది నిజమేనని పించి ఆమె రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్ మీద నాలుగేళ్ల క్రితం ఈ కాలేజీలో చేరింది.

రవిబాబు విషయానికొస్తే రవిబాబుకు పెళ్లయింది కాని, పిల్లలు లేరు. లలిత వాళ్ల ఇంటికి వచ్చి

వెళ్లిన పలు సందర్భాలలో, 'లక్ష్మి మీకు అనుకూలవతి అయిన భార్య,' అంటూ వ్యాఖ్యానించేది కూడాను. అయితే ఇటీవల ఓ ఏడాది క్రితం రవిబాబు భార్య చనిపోయింది. ఈ సంవత్సర కాలంలో రవిబాబు గురించి చాలా పట్టించుకుంది లలిత.

సహచరుడు లేని ఒంటరితనం భరించకపోయి ఉంటే, ఆమె రవిబాబును అంతగా పట్టించుకోకపోయి ఉండేదేమో. ఒంటరితనం బాధ తెలిసిన మనిషి కావడం వల్ల ఆమె రవిబాబుకు అర్ధరాత్రిళ్లయినా ఫోను చేసి పలకరించేది. సాయంత్రాల పూట కలిసి హోటల్‌కి వెళ్లేది. కొన్నిసార్లు ఒకరిళ్లకు మరొకరు వెళ్లి భోజనం చేసుకుని తిని ఎవరిళ్లకు వాళ్లు వెళ్లేవారు. అయితే, వాళ్లు కలిసి గడిపిన ప్రతి సందర్భంలోనూ సాహిత్య చర్చో, సామాజిక విశ్లేషణో, రాజకీయాలో, సినిమాలో- ఇలా ఏదో ఒక బాహ్య విషయం గురించే మాట్లాడు కుంటూ వచ్చారు.

*

అయిదు నిమిషాలు కావస్తున్నా ఆమె తేరుకోక పోవడంతో... దగ్గరగా వచ్చి భుజాలు పట్టుకుని కుది పాడు రవిబాబు, కాస్త కంగారుగా.

ఆమె ఈ ప్రపంచంలోకి వచ్చీరాగానే కదుపుతున్న రవిబాబు చేతిని విదిలించి, అంతే వేగంతో పైకి లేచి పట్టరాని కోపంతో అతడిని చెంపదెబ్బ కొట్టింది.

"ఇలా కుదపడం అవసరమా? నామీద కోరిక వెలిబుచ్చుతూ హఠాత్తుగా నన్నడిగిన మాటకే నేను షాకయ్యాను. ఆ సమయంలో మరింత చొరవ తీసు కుంటావా!"

తను తాకడం కూడా అపార్థానికి దారి తీయడం తో చెంప తడుముకుంటూ అన్నాడు రవిబాబు, "లేదు లలితా! అడగడం తప్పనిపిస్తే తప్పే. కాని నువ్వు షాకయ్యావని భయపడి కుదిపానంతే."

"సరే వెళ్లు... లేచి ఇంటికెళ్లు," తల పైకెత్తకుండా చూపుడువేలును వాకిలి వేపు చూపుతూ ఆజ్ఞాపించి నట్టుగా అంది లలిత.

"నిన్నిపుడు ఇలా వదిలి ఇంటికి వెళ్లలేను. నిన్ను బాధపెట్టాను."

"అది ముందు తెలియాలి. ఇపుడు నువ్వుంటే ఇంకా బాధపడతాను. నాలో ఏం కోరుకుంటున్నావు నువ్వు? ఇడియట్! ఈ శరీరాన్నే కదా! అసలు నీ ఉద్దేశం ఏమిటి- నా బాధ తీర్చాలనా? నీ బాధ తీర్చు కోవాలనా? ప్రతి బాధనీ తీర్చేసుకోవలసిందేనా- మొయ్యలేవా? బాధ... నీ శరీరానిదా? నీ మనసుదా? కంట్రోల్ లేదా! జ్ఞానం లేదా? నిజానికి గెటౌట్ అనాలనుంది- అయినా నాది ఆవేశం మాత్రమే- కోపం లేదు. వెళ్లు."

నిరుత్తరుడై చేష్టలుడిగిపోయిన రవిబాబు, "ఇంక నాతో మాట్లాడవా లలితా?" బేలగా అన్నాడు.

ఆమె ఆవేశం ఇంకా చల్లారకపోవడంతో సర యిన సమాధానం ఇవ్వలేకపోయింది.

"ముందు వెళ్లు. వెళ్లిపో," ఆమె తన పాదాల వద్ద నేలను దీక్షగా చూస్తూ అంది.

"నేను వెళ్లను... నువ్వేదో అఘాయిత్యం చేస్తావు... లేదా కుమిలిపోతావు- నీ బాధ నాది కాదా లలితా... నా పొరపాటును క్షమించలేవా... ప్లీజ్ లలితా... కాస్సేపుండి వెళ్లిపోతాను," దగ్గరకొచ్చి బతిమాల బోయాడు.

ఆమె అతన్ని మళ్లీ చెంపదెబ్బ కొట్టింది. ఇది గతంలో కంటే చురుకుగా ఉన్నా రవిబాబుకి ఒకటి అర్థమైంది. ఇది ఆమె తనను క్షమిస్తూ కొట్టిన చెంప దెబ్బని. కొట్టిన వెంటనే ఆమె అంది.

"నాకూ నువ్వు తప్ప ఎవరున్నారని! ఇడియట్! వెళ్లి రేపు రా ఫో. రేపటిలోగా మళ్లీ నా శరీరం గురించిన స్పృహ నీకొచ్చిందంటే రానవసరంలేదు," అంటూ దబ్బున తలుపేసుకుంది.

*

మర్నాడు కాలేజీకి రాలేదు లలిత. ఆ సాయంత్రం కాలేజీ వదిలాక ఫోన్ చేశాడు రవిబాబు. తను బాగానే ఉన్నానని చెప్పింది. ఇంటికి వస్తున్నానంటే రమ్మంది.

రవిబాబు ఇంటికొచ్చాక కాఫీ పెట్టుకొచ్చి కప్పు అందిస్తూ అడిగింది లలిత.

"నిన్న బాగా నిద్రపోయావా?"

"నిద్ర పట్టదేమోనని తాగి వెళ్లి పడుకున్నాను."

"తాగుతావా?"

"అదేగదా చెప్తున్నాను."

"నీకా అలవాటున్నట్టు చెప్పనే లేదు."

"నాకు అలవాటేం లేదు. ఎవరో ఏదో ఆరునెల్ల పాటు చేయరంట. అలా... అంతే!"

"ఛీ! ఇన్‌టేక్‌కీ, ఔట్‌లెట్‌కీ పోలిక ఎట్లా తెస్తావు నువ్వు?"

"నేను అజ్ఞానినని నిన్న కూడా ప్రూవ్ చేసు కున్నాను గదా!"

"కాదు- కొవ్వుందని," క్షణంసేపు అతని కళ్లలోకి చూసి చేతిలోంచి కాఫీకప్పు తీసుకుంటూ అందామె.

"నువ్వెంతో అభ్యుదయకరంగా ఉంటావు కదా... ఇంత సతీసావిత్రి లెవెల్లో ఉంటావని నేను అనుకోలేదు మరి. మన చర్చల్లో నాలుగైదుసార్లు ఆడ-మగ కలయిక గురించి క్యాజువల్‌గానే మాట్లాడు కున్నాం గుర్తుందా? మరి కొవ్వెలా అవుతుంది?"

"సతీసావిత్రికేనా కేరెక్టర్ ఉండేది. ఈనాటి ఆడవాళ్లకుండదా? కొన్ని సందర్భాలలో కలయిక గురించి పట్టింపు ఉండకూడదని వాదించే వాళ్లంతా ఎవరు పిలిస్తే వాళ్లకు దాసోహం అనాలా?"

"నా ఒంటరితనం, కోరికలు ఇటీవల నన్ను కొంత వేధిస్తున్నాయి. నువ్వెలా భరిస్తున్నావో అని నా కుతూహలం. ఏం తెలుసుకోవాలన్నా నాకు నువ్వు తప్ప ఎవరున్నారు చెప్పు? అయినా నాలుగైదు సంవత్సరాల ఆత్మీయ పరిచయస్తుడు సెక్స్ దగ్గర కొచ్చేసరికి పరాయి వాడైపోతాడా తల్లీ?"

"అలా పరాయివాడివని అనుకుంటే నువ్విలాళ రావు. మన శరీరాలు, గతం కూడా వేర్వేరు వ్యక్తులతో ముడిపడి ఉన్నాయి. ఆ స్మృతులన్నీ ఏ ఒంటరి తీరాలలోనో, ఎడారి ఒయాసిస్సుల దగ్గరో సంగీతఝరిలా ఆవిష్కరించబడి ఉంటాయి. ఆవు గడ్డి నెమరు వేసు కున్నట్లు స్మృతుల్ని నెమరు వేసుకుంటూ గడపడం నేర్చు కోవాలి. ఒంటరి రాత్రులలో నా భర్త స్మృతులతో నేనేదో తంటాలు పడుతున్నాను. చాలా, ఇంకా విప్పి చెప్పాలా?"

"నువ్వు నీ భర్త స్మృతులతో, నేను నా భార్య జ్ఞాపకాలతోనే గడపాలంటావా?"

"చేతకాదా నీకు?"

"అంత అవసరమా?"

"నా శరీరంతో నీ దాహం తీరుతుందా? నేను నీకంత అవసరం అనిపిస్తుందా? నువ్వు నన్ను మనసులో కోరువడమనేది గతంలో, అంటే నీ భార్య ఉండగా కూడా ఉందా?"

"లేదు లలితా! నాకెప్పుడూ ఆ ఉద్దేశం లేదు."

"నీ భార్య ఉండగా నామీద ఎప్పుడూ మోజు లేదంటే- నువ్వు నన్ను ప్రత్యేకించి కోరుకోవడం లేదన్న మాట- అంటే ఇపుడు ఆమె స్థానంలో నన్ను ప్రతిక్షేపిస్తు న్నావు- అంతేగదా!"

హఠాత్తుగా వచ్చిన ఈ ప్రశ్నకు ఏం చెప్పాలో తోచలేదు అతనికి. చివరికి, "నాకు పెళ్లి కాకుండా ఉంటే బాగుండేదనిపిస్తుంది లలితా," అన్నాడు రవిబాబు.

"అసలు నువ్వు పుట్టకుండా ఉంటే ఇంకా బాగుండేది."

రవిబాబు దిగులుగా ముఖంపెట్టి అన్నాడు, "నువ్విపుడు ఒంటరిగా జీవిస్తుండేదానివి గదా లలితా."

ఆమె రెండు క్షణాలు అతని కళ్లలోకే చూస్తూ, ఆ తర్వాత వేగంగా కదిలి ముందుగా నుదుటిపై, ఆ తర్వాత బుగ్గపై, ఆ వెంటనే పెదవులపై ముద్దు పెట్టు కుంది. అతడామెను ఆత్మీయంగా పొదివి పట్టుకుని చుట్టూ చేతులు వేయడం, ఆమె అడ్డగించకపోవడంతో ఇద్దరూ వశం తప్పారు. కొంతసేపు... వారి మాటలన్నీ అస్పష్టంగానే ఉండిపోయాయి.

*

ఆ అలౌకిక ప్రపంచం నుండి బయటపడి తేరు కున్నాక, ఆమె బుగ్గ మీద ఒక నీటిబొట్టు జారడం చూసి అన్నాడు రవిబాబు, "తప్పు జరిగిందా?"

"తప్పనిపించింది నేనెప్పుడూ చేయను."

"మరి."

"నిన్నంతా అనుకున్నాను. ఇంత దూరం మనం రావద్దని! నాలో ఎందుకింత బలహీనత ఏర్పడింది? మనం దూరంగా ఉంటూ స్నేహంగా ఉండటానికి ఎన్ని ప్రణాళికలు వేశాను. అన్నీ వృథా అయిపోయాయి. నిన్న నేను అడ్డుకున్నట్లు ఈరోజు నువ్వు నన్నెందుకు అడ్డు కోలేదు?"

"నీకై నువ్వు దగ్గరకొచ్చినప్పుడు అడ్డుకోవడమా! వనిత తనంత చెంతకు చేరిన... అని కోపగించుకోనా?"

"ఛీ... ఛీ... నేనా క్షణంలో కోరిక పుట్టి నీకు చేరువ కాలేదు. నువ్వు చూపిన ఆపేక్షకు నాలో ఏమీ మిగుల్చుకోకూడదనిపించిందా క్షణం! నిజానికి పెళ్లయిన కొత్తలో ఇంతకుమించి ఎన్నో రెట్లు ఆపేక్షను నా భర్త నా మీద చూపించాడు. అయినా అతన్ని నేను ఆహ్వానించడానికి ఆరునెలలు పట్టింది తెలుసా?"

"ఆరునెలలా?"

"అవును! ఆరునెలల పైగానే నా పర్మిషన్ లేకుండా తను నన్ను తాకను కూడా లేదు."

"ఎందుకలా?"

కాసేపు సమయం తీసుకుని చెప్పిందామె. "అప్పట్లో కట్నం హత్యల వార్తల వల్ల మగాళ్ల పట్ల ఒక రకమైన వ్యతిరేకభావం ఏర్పడింది నాలో. అదెంతవరకు పోయిందంటే చివరకు మా నాన్న, తను నన్ను ఎంత

ప్రేమగా చూసుకున్నా కూడా కొన్ని సందర్భాలలో క్రౌర్యం దాచుకున్న మనిషిలాగే కనిపించసాగారు. పెళ్లి వద్దంటే ఏమంటాడోననే భయంతోనే పెళ్లికి అంగీకరించాను నేను. పెళ్లయ్యాక ఎన్నో రాత్రుళ్లు నా భర్త నాతో ఓపికగా జరిపిన ఓదార్పులు, చర్చలు, బతిమాలడం వంటి వాటితో నేను కొంత మారాను. చివరికొక నాడు, నా భర్త కన్నీళ్లతో నా పాదాలు తడిపిన ఒకానొక క్షణంలో అతన్ని ఓదార్చడానికి కౌగలించుకున్నాను. అదే మా తొలి రాత్రి.''

సాలోచనగా తల ఊపుతూ అన్నాడు రవిబాబు, ''నువ్వు మరీ ఇంత సున్నితమైనదానివని తెలీదు లలితా! బయట జరిగే అన్యాయాలు ఎన్ని సున్నిత హృదయాలను ముడుచుకుపోయేలా చేస్తున్నాయోనని పిస్తుంది నాక్కూడా. నా బుద్ధికి పరిష్కారం దొరకలేదు ఎప్పుడూ.''

''మనుషులకు సాంస్కృతిక విలువలు పిల్లల స్థాయి నుంచే నేర్పాలి రవీ. ఏటా విలువలతో కూడిన కథలను ప్రభుత్వం హైస్కూలు స్థాయిలోని సిలబస్‌లో పెడితే ఎంత బాగుంటుంది. అది జరగకుండా, చిన్నప్పటి నుంచి ఈ ఎయిడ్స్ ప్రచారం ఒకటి! మనుషులకు కోరికని అదుపులో ఉంచుకునే సంస్కారాన్ని నేర్పకుండా, కండోమ్ వేసుకుని స్పెర్మ్‌ని బ్లాక్ చేయడమే పరిష్కారమంటూ, నిగ్రహాన్ని సర్వనాశనం చేసి పారేస్తున్నారు. సెక్స్ ఒక కేజువల్ థింగ్‌గా ప్రచారం చేస్తున్న అంతర్జాతీయ యంత్రాంగం తమ భార్యాపిల్లలతో కూడా అలాగే ప్రవర్తిస్తుంటారా! వీరంతా తమ కొడుకు, కూతుర్లు బయటకెళ్లేపుడు కండోమ్స్ తీసుకెళుతుంటే అభినందిస్తారా? ఇతరులతో కలయిక నిరోధించడానికి సంస్కారానికి మించిన కండోమ్ ఉందా? మనుషులు స్పేస్‌లో స్టేషన్లు నిర్మించి నివాసం ఉంటున్నారుగాని, తమలో దాగి ఉన్న ఈస్తటిక్ స్పేస్ విలువని గుర్తించడం లేదు. శృంగార అనుభవాలను నెమరు వేసుకోవడం నేర్చుకోవడం లేదు.

''అవునూ! నువ్వొక మగాడిగా నాకొక ప్రశ్నకు సమాధానం చెబుతావా?''

''నాకెందుకో భయంగా ఉంది! సరే అడుగు.''

''బయట ఆడవాళ్లని చూస్తే అఘాయిత్యం చెయ్యాలని నీకు ఎప్పుడైనా అనిపించిందా? మగాడిగా చెప్పు... నిజమే చెప్పు.''

క్షణం మౌనంగా ఉండి, ''నిజం చెప్పనా! కొందరు ఆడవాళ్లని చూస్తే ఎందుకో అలాంటి అక్కో చెల్లెలో ఉంటే బాగుంటుందనిపిస్తుంది. కొందర్ని చూస్తే గౌరవించాలనిపిస్తుంది. ఇంకొందరి అవయవ సౌష్టవం, నడక, డ్రెస్సింగ్ చూస్తే (ఒక నవ్వు నవ్వి)... చుట్టూ ఉన్నవాళ్లంతా క్షణం మాయమైపోయి తననక్కడే గట్టిగా పట్టుకోవాలనిపిస్తుంది.''

''మైగాడ్!'' గుండెల మీద రెండు చేతులు ఆనించుకుంది లలిత. ఆమె కనుగుడ్లు పెద్దవయ్యాయి.

మాటలు కొనసాగించాడు రవి. ''ఆగవమ్మా ఆగు! నాకు చిన్నప్పుడు 5-6 ఏళ్ల పాటు రెండు అలవాట్లుండేవి. ఒకటి- ఏదో ఒక పూలమొక్కని పెంచడం, రెండవది- పాకెట్ మనీని దాచుకోవడం, పండగలప్పుడు ఆ డబ్బుతో ఇష్టమైనదాన్ని కొనుక్కోవడం. మొదటి అలవాటు ప్రాణం విలువని నేర్పడంతో నాలో హింసా ప్రవృత్తి ఏర్పడలేదు. రెండవదాని వల్ల నాలోని ఇష్టాయిష్టాలను దాచుకొని సందర్భోచితంగా ఆ మొత్తాన్ని ఖర్చు చేయడం అలవాటైంది. స్త్రీల విషయంలో ఈ రెండవది నాకు బాగా ఉపయోగపడుండాలి. పరాయి స్త్రీల మీద ఏర్పడే ఇష్టాలు, కోరికలు అన్నీ నువ్వన్న ఈస్తటిక్ స్పేస్‌లో స్టోరయి బహుశా లక్ష్మితో జరిగే సంగమంలో లీనమయ్యేవేమో.''

''ఆ ఈస్తటిక్ స్పేస్ లేకనేగదా, అయిదేళ్ల పిల్లల్ని కూడా రేప్ చేసి పడేసేంతగా మనుషుల్లో క్రూర ప్రవృత్తి నెలకొన్నది. మనమధ్య ఎలాంటి వ్యక్తులు సంచరిస్తున్నారో తెలిస్తే భయమేస్తుంది ఒక్కోసారి. వందలకొద్దీ ఆడవాళ్ల శరీరాల నునుపు, వంపులు ఎక్కడబడితే అక్కడ ప్రకటనల్లో పదేపదే కనబడుతుండటంతో, శరీరాల రాపిడికి ఎవరైనా ఒకటేనన్న యావ చివరికి ఇంటలెక్చువల్స్‌కీ పాకిపోయింది. మన డిపార్ట్‌మెంట్ సంగతి చెప్పు. మగ లెక్చరర్లు విద్యార్థులను కోరుకోవడం, వేధించడం వంటి వార్తలు కూడా చూస్తున్నాం. జంతువులు కూడా పరస్పరం అంగీకారం లేకుండా శృంగారం జరుపుకోవు. ఇలాంటి వార్తలు, జ్ఞాపకాలు ఎదురైతే నేనాడదాన్నని గుర్తొచ్చి ఒంటరిగా భయపడుతుంటాను తెలుసా?''

ఆమె చేతులను తన చేతుల్లోకి తీసుకుని తల నిమురుతూ అన్నాడు రవిబాబు. ''సారీ లలితా! ప్లీజ్

లలితా! నీ లోలోపల ఈ విషయాలపై ఇంతటి ఒత్తిడి, ఘర్షణ కూడగట్టుకుని ఉన్నట్టు తెలీదు లలితా! రియల్లీ అయామ్ వెరీ సారీ! ఎక్కడో నాలో గూడు కట్టుకున్న ఒంటరితనం నుంచి ఏర్పడ్డ నీ సానుకూలతలోంచే ఇది జరిగిందిగాని యావ కాదు. మనం సంస్కారవంతమైన స్నేహితులుగానే మిగిలిపోదాం.''

''అదిగో మళ్లీ అదేమాట. ఆ క్షణంలో నీకు పెట్టిన ముద్దు నీ ఆపేక్షకు పెట్టిన ప్రతిఫలం మాత్రమే. నీకు నేనొక గిఫ్ట్ మాత్రమే ఇస్తున్నాననుకున్నాను. నీ ప్రతి చర్యకు నేను అడ్డు చెప్పలేకపోవడం వల్లనే- అది సానుకూలత అనుకుంటున్నావు. ఎంతైనా నువ్వూ మగాడివేగా! నువ్విలా అనుకుంటే నాకు నష్టమేం లేదుగాని, నేనంటే నీకు గౌరవం పోతుందంతే. అప్పుడు స్నేహమూ పోతుంది.''

తన తలపై తనే రెండు మొట్టికాయలు వేసుకుని, ''అర్థమైంది... అర్థమైంది,'' అంటూ తల ఊపాడు రవిబాబు.

చిన్నగా నవ్వుతూ, ''దట్స్ గుడ్...'' అంది లలిత.

*

కథ చదవడం పూర్తయ్యాక కాగితాలను మడిచి పట్టుకొని రచయితతో అన్నాడు మిత్రుడు.

''వీళ్లిద్దరూ మళ్లీ శారీరకంగా కలుసుకోరంటావా?

''వీళ్లిద్దరి మధ్య శారీరక సంబంధాన్ని మించిన సంబంధం కథలో కనబడలేదంటావా? ఒక్క శారీరక సంబంధం గురించే ఎందుకు ప్రశ్నించావు.''

''వాళ్లిద్దరూ కూడా తమకి తాము శరీరాల కలయిక దగ్గరనే నియమాలు పెట్టుకున్నారు గదా మరి?''

''వాళ్ల నియమాలకి- అనేక బాహ్య, సాంఘిక కారణాలు ఉండవచ్చునేమో!'' అన్నాడు రచయిత.

''అవి ఛేదించబడిన సందర్భంలోనేకదా శారీరకంగా కలుసుకున్నారు ఇద్దరూ!''

''అదేదో అక్రమమన్నట్టు శారీరీకస్పృహతోనే మాట్లాడతావెందుకు? ప్రేమపూర్వకమైన ఒక సంగమంలా గుర్తించవేమి?''

''సరే- అలాంటి సంగమం వాళ్లిద్దరి మధ్య భవిష్యత్తులో జరిగే అవకాశాలున్నాయంటావా?'' నవ్వుతూ అన్నాడు మిత్రుడు.

''కొన్ని సంగమాలు కంటిచూపుతో ముగుస్తాయి... ఇంకొన్ని కరచాలనంతోనో, కౌగిలింతతోనో ముగియ వచ్చు... మరికొన్ని శరీరంలోని అణువణువు ఈస్తటిక్ స్పేస్ లోపల ఐక్యం కావడంతో ముగుస్తుంటాయి! అది వాళ్లిద్దరికీ మాత్రమే సంబంధించిన వ్యవహారం!''

''అలాగైతే, వాళ్లిద్దరికీ పెళ్లి చేసేయలేకపోయావా మరి?'' అన్నాడు మిత్రుడు.

''అది కూడా వాళ్లిద్దరి పర్సనల్...''

''అమ్మో, నీ పాత్రల మీద మాట పడనిచ్చేలా లేవు!'' నవ్వుతూ కథను రచయిత చేతిలో పెట్టాడు మిత్రుడు.

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 10 మే 2009*

